# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పొన్నూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. సోమవారం పొన్నూరు పట్టణంలోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో మెప్మా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ గత ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం నేడు సంపూర్ణంగా రుణ మాఫీ చేశారన్నారు. ఏప్రిల్‌లో అమలు చేయాల్సిన రుణమాఫీని ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగానే పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేసి హామీని నెరవేర్చారని తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా పథకం కింద నియోజకవర్గంలోని సుమారు 5 వేల పొదుపు సంఘాలకు నాలుగు విడతల్లో రూ.180 కోట్లు రుణమాఫీ చేసి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సంఘాల బ్యాంకు వడ్డీలను విడతల వారిగా ప్రభుత్వమే చెల్లించిందన్నారు. పొన్నూరు పట్టణంలోని 976 గ్రూపులకు నాలుగో విడత రుణ మాఫీలో భాగంగా రూ.39.04 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు చెప్పే అసత్యాలు, మాయమాటలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే రోశయ్య మహిళలకు సూచించారు. పట్టణంలో కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ, పార్కుల అభివృద్ధి, ఆధునీకరణ, బస్టాండ్ ఆధునీకరణ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన తమ ప్రభుత్వంపై టీడీపీ నాయకులకు మాట్లాడే అర్హతే లేదన్నారు.

**త్వరిత గతిన అభివృద్ధి పనులు పూర్తి**

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని వెల్లలూరు గ్రామంలో రూ.46 లక్షలతో నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్, రూ. 19 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో రహదారి ప్రమాదాలు దూరం

పెదకాకాని: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి రాఘవరావు అన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నందు సోమవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కళాశాల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ అధికారి రాఘవరావు మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డుకు ఎడమవైపు మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.













## ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కడదాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని



వంగిపురం (ప్రత్తిపాడు): అందరిలో ఒక్కడిగా ఉంటూ అండగా నిలబడతానని ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వంగిపురంలో సోమవారం బలసాని పర్యటించారు. స్థానిక దళితవాడలో నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు బలసానిపై పూలవర్షం కురిపించారు. తప్పెట్లు, తీన్‌మార్‌లతో ఘనస్వాగతం పలికారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరికీ ఎల్లవేళలా అందాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉన్న బాబూ జగజ్జీవన్‌రావ్ విగ్రహానికి బలసాని కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మనమంతా కలిసికట్టుగా పనిచేసి ప్రత్తిపాడు గెలుపును జగనన్నకు కానుకగా ఇద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రేపు మునిపల్లెలో బజరంగ్ 'జగన్నామ సంక్షేమ సంగమం'

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు పిలుపు

కొరిటిపాడు(గుంటూరు): సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నామని, ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పొన్నూరు మండలంలోని మునిపల్లె, గోళ్ళమూడిపాడు గ్రామాలకు బుధవారం మునిపల్లె కేంద్రంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. బజరంగ్ నేత్ర జ్యోతి, బజరంగ్– మీ గుండె పదిలం, బజరంగ్–దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవలను శిబిరంలో ఉచితంగా అందిస్తామన్నారు. నేత్రజ్యోతి శిబిరంలో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి వారం రోజుల్లో ఉచితంగా కళ్లజోళ్లు అందించడం జరుగుతుందన్నారు. మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత సమస్యలు గుర్తించి అవసరమైన వారికి యాంజియోగ్రామ్, సర్జరీలు చేయించడం జరుగుతుందని వివరించారు. దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడు సమకూర్చనున్నట్లు వెల్లడించారు. మునిపల్లె, గోళ్ళమూడిపాడు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



గుండె పరీక్షలు చేయించుకున్న వారితో అంబటి మురళీకృష్ణ

**15 మందికి గుండె వైద్య పరీక్షలు**

చేబ్రోలు: చేబ్రోలు గ్రామంలో జనవరి 26, 27 తేదీల్లో జరిగిన 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమని గుర్తించిన 47 మందిలో మొదటి విడతగా 15 మందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ పరీక్షలో 11 మంది ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉండగా, ఇద్దరికి స్టంట్, మరో ఇద్దరికి బైపాస్ సర్జరీ ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యశాలలో బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేషెంట్లను సోమవారం పరామర్శించారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రతరం కాక మునుపే వైద్య శిబిరం ద్వారా వైద్య సహాయం పొందడం అభినందనీయమన్నారు. చేబ్రోలు గ్రామం నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి, పేషెంట్లను జాగ్రత్తగా వైద్యశాలకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి తదుపరి చికిత్సకు పంపడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఈవీఎంలపై సందేహాలను నివృత్తి చేసుకోండి



ప్రత్తిపాడు: ఈవీఎంలపై ఓటర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తహసీల్దార్ జి.సిద్దార్థ తెలిపారు. మండల పరిధిలోని నడింపాలెం, రావిపాటివారిపాలెం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సోమవారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరు, ఓటు వేసే విధానం, వేసిన తరువాత వీవీప్యాట్‌లోనికి స్లిప్ వచ్చే విధానం.. వంటి పలు అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎప్పటిలానే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈవీఎంల వినియోగంపై కొందరికి సందేహాలు, అనుమానాలు ఉన్నాయని, అలాంటి వాటిని తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తుందన్నారు. నిన్నటి వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన అవగాహన క్యాంప్, నేటి నుంచి గ్రామాల్లో కూడా కొనసాగనుందని తహసీల్దార్ తెలిపారు.

## రహదారి ప్రమాదంలో దంపతులకు గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. తెనాలి నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను వడ్లమూడిలో జరిగిన టీడీపీ సభకు వెళ్తున్న యువకులు ద్విచక్రవాహనంతో అతివేగంతో ఢీ కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. తెనాలికి చెందిన దంపతులు టి.రత్నకుమారి, వెంకటేశ్వర్లులకు గాయాలయ్యాయి. రత్నకుమారి తలకు బలమైన గాయమైంది. ఇరువురిని 108 వాహనం ద్వారా గుంటూరు వైద్యశాలకు తరలించారు.







Wish you Happy Birthday
జన్మదిన
శుభాకాంక్షలు
నిగర్వి, నిరాడంబరులు,
అందరిని చిరునవ్వుతో పలకరించే
ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త
శ్రీ బలసాని కిరణ్‌కుమార్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
మీరు ఇలాంటి జన్మదిన వేడుకలు
మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా
కోరుకుంటూ...
సుమన్ త్యాగరాజు
స్టేట్ క్రిష్టియన్ మైనారిటీ సెక్రటరీ
వడ్లమూడి రవికిరణ్ చౌదరి
S.V. Engineering
తానికొండ చిరంజీవి
న్యాయవాది, విజయవాడ
ఇంద్ర బ్రదర్స్
చినపలకలూరు
మంగళపూడి మురళి బ్రదర్స్
నందిగామ
డా॥ విజయ్ భాస్కర్
అభిలాష్య చైల్డ్ & డయాబెటిస్ హాస్పిటల్
రాజు, కిషోర్